C SYMRO1C164

యువభారతి

ఖలీల్ జిబ్రాన్

శిఖరాలూ - లోయలూ

డా॥ సి. నారాయణరెడ్డి

S4MR01C164

శిఖరాలు-లోయలు

ఖలీల్ జిబ్రాన్ కవితోక్తులకు
స్వచ్ఛందానుసరణం

డా॥ సి.నారాయణరెడ్డి

ప్రచురణ

యువభారతి

సాహితీ సాంస్కృతిక సంస్థ
5, కింగ్స్‌వే, సికింద్రాబాద్-3

SHIKHARALU - LOYALU

By Dr. C. Narayana Reddy

KHALIL ZIBRAN'S SAYINGS IN TELUGU

©YUVABHARATHI, SECUNDERABAD-500003.

యువభారతి

ప్రచురణ : 28

ప్రథమ ముద్రణ : 3,200

1 డిశంబర్, 1974

చిత్రాలంకరణ :

కాపు

ముద్రణ :

ప్రతిభా ఆర్ట్ ప్రింటర్స్

రాజమొహల్లా, హైదరాబాద్-500027

ముఖచిత్ర ముద్రణ :

విస్టాస్ ప్రింటర్స్

హైద్రాబాద్.

ప్రతులకు :

యువభారతి

5, కింగ్స్‌వే, సికింద్రాబాద్-500003.

లేదా

యువభారతి కార్యాలయం

ఆంధ్రసారస్వత పరిషత్తు భవనములు

తిలక్ రోడ్, హైద్రాబాద్-500001.

వెల : 2-00 రూ.

PAPER USED FOR THE PRINTING OF THESE BOOKS
WAS MADE AVAILABLE BY THE GOVERNMENT OF INDIA
AT CONCESSIONAL RATES.

YUVABHARATHI IS GRATEFUL.



మా మాట

సమన్వయ దృక్పథం ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పడుతుంది. ఉత్తమ సాహిత్యాధ్యయనం సమన్వయ సాధనకు తొలిమెట్టు. బహుజన హితంకోసం, బహుజన సుఖంకోసం మనిషి ప్రతిభ వ్యక్తం కావాలి. మనిషిలో స్వతస్సిద్ధంగా, అంతర్నిహితంగా ఉన్న మానవత్వాన్ని జాగరితం చేయగలిగే శక్తి సాహిత్యానికే ఉన్నదన్న నమ్మకంతో, ఉత్తమ సాహిత్యాధ్యయనానికి అనువైన పుస్తక ప్రచురణ, సాహిత్య సమావేశాలు, గోష్ఠులు నిర్వహిస్తూ యువభారతి కడచిన పదేళ్లుగా తెలుగు ప్రజల సంస్కృతి వికాసానికి యథోచితంగా కృషి చేస్తున్నది.

ప్రాచీన, అర్వాచిన సాహిత్యాలతో దిఙ్మాత్రంగానైనా పరిచయం కలిగించాలనే ఉద్దేశంతో, సమకాలీన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సునిశితంగా సమవేదనా దృక్కోణంతో పరిచయం కలిగించాలనే ఉద్దేశంతో యువభారతి 'సాహితీవాహిని' పరంపరను ప్రచురిస్తున్నది. ఈ పరంపరలో ఇంత వరకూ వెలువడినవి కేవలం సాహిత్యాధ్యయనానికి సంబంధించినవే. ఇకముందు ముందు కౌటుంబిక, సాంఘిక, వైజ్ఞానిక విషయాలకు సంబంధించిన పుస్తకాలను కూడ ప్రచురించి పఠిత్లలోకానికి అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాము.

సాహిత్యం సార్వకాలీనమని, సార్వజనీనమని, విశ్వజనీనమని ప్రాజ్ఞుల అభిమతం కనుక అంతర్జాతీయ ప్రఖ్యాతి నార్జించిన మహాకవుల, శేముషీ సంపన్నుల భావాలనుకూడా తెలుగువానికి అనువైన పద్ధతిలో అందించాలని యువభారతి ఆకాంక్ష.

తన విలక్షణమైన ప్రతిభతో మానవ సమాజాన్ని జాగరితం చేసిన ప్రతిభామూర్తి ఖలీల్ జిబ్రాన్. ఆయనది లెబనాన్ దేశం. మాతృభాష అరబ్బీ. తనభాషలోనూ ఇంగ్లీషులోనూ ఆయన తనరచనలను వెలువ

రించాడు. పత్యాన్వేషకుడు ఎన్నికష్టాలను అనుభవించాలో అన్నికష్టాలనూ అనుభవించాడు. జిబ్రాన్ కవితతో పరిచయం మానవుడందుకోవలసిన మహోన్నతాదర్శాలతో పరిచయం. మహాకవి జిబ్రాన్‌ను తెలుగు సాహిత్యలోకానికి మొదట సారిగా పరిచయంచేసిన అవకాశం యువభారతికే దక్కింది. ప్రజాకవి కాళోజీ 'జీవనగీత'గా ఖలీల్ జిబ్రాన్ The prophet ను 1968లో యువభారతి అందించింది. అప్పటినుంచీ ఇంతవరకూ జిబ్రాన్ రచనలు తెలుగులోనికి రానేలేదు.

డాక్టరు సి. నారాయణరెడ్డి గారు మహాకవులు. స్నేహపాత్రులు. తన విలక్షణమైన ప్రతిభతో ఆధునికసాహిత్యరంగంలో సమున్నతస్థానం సంపాదించుకున్నవారు. పరిశోధకులుగా, అధ్యాపకులుగా, వాగ్మిపతంసులుగా తెలుగుసాహిత్యలోకానికి ఆయనచేస్తున్న సేవ అపూర్వం. తనభాషలోనే కాక ఇతరభాషలలోని విలువైన భావాలను తనప్రజల కందించాలన్న మహత్వాకాంక్ష రెడ్డిగారితో అత్యుత్కటంగా ఉండబట్టే మీరాబాయి గీతాలను, గాంధీసూక్తులను పురెనోట్ ఉర్దూకవితా ఖండికలను తెలుగు నుడికారపు సొంపులతో స్వయంప్రతిభా పరిమళంతో అందించారు. "శిఖరాలూ-లోయలూ" ఖలీల్ జిబ్రాన్ సాహిత్యంలోని కొన్ని కవితోత్తులకు స్వచ్ఛందంగా సాగిన అనుసృజనం. జిబ్రాన్‌ను రెండవ సారిగా ఇంతముచ్చటగా, ఇంత అందంగా, ఇంత కవితాత్మకంగా యువభారతి అందించగలుగుతున్నందుకు హర్షోత్ఫుల్ల హృదయంతో డా॥ సి. నారాయణరెడ్డి గారికి కృతజ్ఞతాభివందనాలను సమర్పిస్తున్నది.

విశ్వకవి ఖలీల్ జిబ్రాన్ ప్రతిభాపాండిత్యాల పుట్టమైరిగిన మనీషులు, నిరంతర అధ్యయనశీలురు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు శ్రీ ఒ. చిన్నపరెడ్డిగారు ఈ కవితాసంపుటికి విలువైన పీఠికను సమకూర్చినారు. శ్రీరెడ్డిగారికి యువభారతి హృదయపూర్వకమైన కృతజ్ఞతలను అందజేస్తున్నది.

ఈకవితాసంపుటిని తమ చిత్రకళావిన్యాసంతో అందంగా అలంకరించిన ప్రముఖ చిత్రకారులు శ్రీ బాపుగారికి మా ధన్యవాదాలు.

సహృదయులు యువభారతి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు రూపకల్పనలు దిద్దడంలోను, వాటిని విజయవంతం చేయడంలోను యథోచితంగా తోడ్పడి తమతమ శక్తియుక్తులను, ఔదార్యాన్ని, సాహిత్యాభిమానాన్ని ప్రకటిస్తారని ఆశిస్తాము.

1-12-1974

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షుడు.



యువభారతి పరిచయము

మనిషిలో అంతర్లీనంగా, నిక్షిప్తంగా ఉన్న ప్రతిభా పరిమళాలు పరిపూర్ణంగా వ్యాప్తం కాగల్గినప్పుడే అతని సృజనాత్మక శక్తికి సార్థక్యం చేకూరుతుంది. సమాజంలో సౌందర్యం, సౌజన్యం పెంపొందడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది. పరస్పరావగాహనం జరుగుతుంది. నిర్మాణాత్మక దృక్పథాలకు ప్రాచుర్యం లభిస్తుంది. సమైక్యభావాలు కుదురుకుంటాయి.

యువభారతి కడచిన పదేళ్లుగా సమాజంలో సామరస్యాన్ని పెంపొందించేందుకు సాహిత్యంకంటె ఇతరమైన సాత్త్విక సాధనం లేదనే విశ్వాసంతో ఇతోధిక కార్యక్రమాలను రూపొందించి కృషి చేస్తున్నది. సాధ్యమైనంత తక్కువధరకు, వీలైనంత ఎక్కువమందికీ ఉత్తమ సాహిత్యాన్ని అందిస్తే సాహిత్యంపట్ల ప్రజానీకానికి అభిరుచి పెరుగుతుందనే నమ్మకంతో.... ప్రచురణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈనాటికి 32 ప్రచురణలను ప్రచురించి, రెండులక్షల ప్రతులకు పైగా సాధ్యమైనంత తక్కువధరకు తెలుగు పాఠకులకు అందించినది.

భారత దేశంలోని నలుమూలలవారూ యువభారతి నిర్వహిస్తున్న సాహిత్యోద్యమంలో పాలు పంచుకోగలిగేందుకు ప్రారంభింపబడిన సాహితీమిత్ర పథకంలో దాదాపు 7,500 మంది సహృదయులు చేరి ప్రణాళికను విజయవంతం చేశారు. ఈరోజు నుండి ఈ ప్రణాళిక కొత్తరూపు దాల్చుతున్నది. ఇందులో కూడా సహృదయులు చేరి తమ సహాయ సహకారాలు అందజేస్తారని ఆశిస్తాము. యువభారతి భవిష్యన్నిర్మాణంలో సహకరించేందుకు ఆరంభింపబడిన శాశ్వత జీవిత సభ్యత్వ పథకంలో ఇంతి మిత్రులుగా దాదాపు 460 మంది, భారతీ భూషణులుగా 60 మంది చేరారు.

ఉదాత్త శక్తితో మేము చేస్తున్న భాషాసేవకు అందదండలుగా నిలిచిన ప్రజలు, వారి సాహార్దం, భాషాప్రియత్వం ఇవే మాపెట్టుబడి. మా తపస్సు ఫలించి తెలుగు దేశంలో అధ్యయనశీలత సౌజన్యం పెంపొందాలని ఆకాంక్షిస్తూ-

ఇరివెంటి కృష్ణమూర్తి
అధ్యక్షుడు
యువభారతి.

1-12-1974

అనుస్పృజనం

" ఈనాటి నా హృదయఘోష
రేపటి కోటి హృదయాల జీవధ్వాష "

జిబ్రాన్ గుండెను చీల్చుకొని ఉబికి వచ్చిన జీవనాద మిది. కవిత్వాన్ని జీవితాన్ని కలిపి కుట్టిన అక్షరసూత్రమిది.

జిబ్రాన్ నయన యుగళం - దర్శనం, వర్ణనం. అసలు ఏకవి వ్యక్తిత్వానికైనా ఈ గుణద్వయమే మూలధనం.

దర్శనం ఉన్నకవే శిఖరాల ఎత్తులూ, లోయల లోతులూ ఏకకాలంలో చూడగలుగుతాడు. చూసింది మననం చేసుకోగలుగుతాడు. మననం చేసుకున్నది తన వర్ణనా ప్రతిభను బట్టి కావలసిన రంగులతో బొమ్మకట్టగలుగుతాడు.

ఇంతకూ దర్శనం vision. వర్ణనం provision .

ఈ రెండు శక్తుల సముచిత సమ్మేళనమే జిబ్రాన్ కవిత. పదార్థ విశ్లేషణంలో ఎంతటి తాత్త్వికతను ప్రదర్శిస్తాడో, భవిష్యత్ నిరూపణంలో అంతటి ఆశావాదాన్ని ప్రకటిస్తాడీకవి. చిన్నచిన్న మాటల్లో మిన్నేరులను పారించడం ఈ కవికి పెన్నతో పెట్టిన విద్య. మామూలు సత్యాలను కూడా తన రసవాద శక్తితో మహత్తర సువర్ణశలాకలుగా మలచుకోవడం ఇతని మౌళికత.

"చట్టాల వలలు పన్నే దెందుకు ?
చిట్టిచేపలను పట్టేటందుకు."

యుగయుగాలుగా వస్తున్న సాంఘిక వ్యవస్థ చెవులు మెలిపెట్టి చెప్పిన నిష్ఠుర సత్యమది. ఇలాంటి సత్యాలు జిబ్రాన్ సూక్తుల్లో కోకొల్లలు.

చిరకాలంగా ఖలీల్ జిబ్రాన్ కవితలను చదివి కొన్నిటిని మిత్రులతో ప్రతిస్పందించుకున్నాను, మరికొన్నిటిని ఒంటరిగా ఆస్వాదించుకున్నాను. ఏ కొన్నిటినైనా తెలుగులో అనువదిస్తే బాగుంటుందని అనుకుంటూనే ఉన్నాను.

అప్పుడప్పుడు, హృదయం స్పందించినప్పుడు తెలుగులో అనువదించుకున్న ఖలీల్ కవితోక్తులను చిన్న సంపుటిగా వెలువరించాలనుకున్నాను.

ఆకాంక్ష నాది, ఆకృతి తీర్చింది 'యువభారతి'. అనువాదాన్ని వ్యాజనంచేసింది నేను; అమూల్య పీఠికపై ఈ సంపుటిని నిలిపింది ప్రముఖ న్యాయమూర్తి, ప్రగతి పథవర్తి శ్రీ చిన్నపరెడ్డిగారు.

మాటలతో బొమ్మగీచింది నేను, రేఖలతో జీవంపోసింది బాపు.

అందరికీ కృతజ్ఞతలు.

'త్రివేణి' వివేకనగర్
హైదరాబాదు–500020.

డా॥ సి. నారాయణరెడ్డి

ముందుమాట

—జస్టిస్ ఓ. చిన్నపరెడ్డి.

ఖలీల్ జిబ్రాన్ మహాకవి, విజ్ఞాని. ఆంధ్రసాహితీ ప్రపంచానికి ఖలీల్ కవితనూ, ఫిలాసఫీని 'శిఖరాలూ- లోయలూ' అనే తన కవితోక్తుల సంపుటి ద్వారా డా॥ నారాయణరెడ్డి పరిచయం చేస్తున్నాడు. 'శిఖరాలూ- లోయలు' చదివే నారాయణరెడ్డి కవితా ప్రియులందరూ తప్పక జిబ్రాన్ కవితా - విజ్ఞానాధికులవుతారని ఆశిస్తున్నాను.

'శిఖరాలూ- లోయలు' ఖలీల్ జిబ్రాన్ కవితోక్తుల అనుసరణకు నారాయణరెడ్డి మంచిపేరే పెట్టాడు. శిఖరాలు పరిగర్విత మేఘాలనందుకుంటూ ఔన్నత్యాన్ని గాంభీర్యాన్ని సూచిస్తాయి. వానకు తడిసిన పచ్చగడ్డి పాన్పును పరచుకొన్న లోయలు లోతునూ, మెత్తదనాన్ని సూచిస్తాయి. ఖలీల్ కవితలో ఇంకా ఎన్నో భావసౌందర్యాలంకృత మధుర గీతికలు, రచనలు ఉన్నాయి. కనీ నారాయణరెడ్డి పదునుకోసం, పటుత్వంకోసం ఏరిపట్టుకొన్నాడీ కవితోక్తులను, సౌందర్యమాధుర్యాలను పరిత్యజించకుండా.

జిబ్రాన్ కవిత హృదయంలోనుండి పెల్లుబికిన ప్రవాహం. ప్రతి హృదయాన్ని స్పృశిస్తుందా ప్రవాహం. అదొక మృదిమధుమంథానాదం; ప్రతి గుండెలో మారు పలికే రాగం. నిరంతరంగా మీదిలో కలిసే పరిమళం. మానవుని నీడలా వెన్నంటి వేధించే నిరంతర జీవిత సమస్యలను నిర్మలంగా కరుణామయ హృదయంతో పరీక్షించి పరిష్కరించ ప్రయత్నిస్తాడు జిబ్రాన్. తా నర్థం చేసుకొన్న సత్యాలు, అందరకూ అందజేస్తాడు; మృదు మధురశైలిలో సునాయాసంగా, గంభీరంగా, సూక్తిరూపంగా, సూత్రరూపంగా, సామ్యరూపంగా.

జిబ్రాన్ భాషలోనేకాదు, భావంలో కూడా అందముంటుంది. సంక్షిప్తత, సౌందర్యం జిబ్రాన్ కవిత ప్రత్యేకతలు. కరుణ, జాలి, జిబ్రాన్ విజ్ఞాన ప్రత్యేకతలు. పరుష మెరుగదు జిబ్రాన్ కవిత. కలుష మెరుగదు జిబ్రాన్ హృదయం.

జిబ్రాన్ రచనలను, ఆలోచనలను, తెలుగువారికి నారాయణరెడ్డి పరిచయం చేయడం ఎంతో సమంజసంగా ఉంది. జిబ్రాన్ మానవతామూర్తి, అతని కవితలు

మానవతే పరమాపధి. నారాయణరెడ్డి మానవతాభిలాషి. అతని కవితకు మానవతే మహాశయం. వారిరువురి కవితావస్తువులూ మానవుడు, మానవ జీవితం. వారు కోరేది విశ్వ మానవప్రేమ, వారన్వేషించేది మానవుణ్ణి ఉత్తేజపరిచేజ్ఞానం, వారు నేర్పించేది మానవజాతిపై జాలి, కరుణ. ఇరువురి రచనల్లో విన్పించే నినాదం, నిష్కళ మానవతాగానం. "పరిమళాల నెవడాపును? పైరగాలి నెవడాపును ? ఎవడాపును మానవతా రవి రుక్కును, కవివాక్కును?" అన్న నారాయణరెడ్డికి గాక వేరెవరికున్నవి? "ప్రకృతి ప్రసవించిన పాపలే పూలు, అనురాగం కుసుమించిన పూలే పాపలు" అన్న జిబ్రాన్ కవితా మధువును చదువరుల కందించడానికి పరిపూర్ణతార్హతలు?

జిబ్రాన్ అల్లిన ప్రతి కావ్యంలో, సామ్యంలో, సరిగపోగువలె మానవత ప్రతిచోటా గోచరిస్తుంది. ఆ మానవత ప్రధానాంశాలు విశ్వమానవ సౌభ్రాతృత్వం, సౌజన్యం, స్వాతంత్ర్య ప్రీతి. జాతి, మత, దేశ భేదాలతనికి అవసరంలేదు. ఒక సారన్నాడు: "నీవు చర్చిలో అర్చించినా, మసీదులో ప్రార్థించినా, సినగోగ్‌లో ఆరాధించినా నీవు నా సోదరుడవు. నేను నిన్ను ప్రేమిస్తాను" అని. మానవ రూపవికాసాలు, శక్తిసామర్థ్యాలు అనవసర విభేదాలతో, అర్థహీనములైన వైరుధ్యాలతో వ్యర్థమై పోతున్నవే అని ఆయన పడే మానసిక క్షోభ మళ్ళీమళ్ళీ వ్యక్తపవుతుంది. నీరసవర్గాల పీడన గమనించి, ఆవేదనపడి, వారి దాస్య శృంఖలాలను ఛేదించి వారికి క్షేమం సమకూర్చాలనే ఆయన ఉద్రేకం తిరిగీ తిరిగీ రచనల్లో ద్యోతకమవుతుంది.

మానవ విభేదాలను గురించిలా అన్నాడు:

"అసలే మనుష్యులు దుర్బలులు
అందులో చచ్చేటన్ని చీలికలా?
అసలే ఈలోకం ఇరుకు
అందులో ఇనిన్ని రాజ్యాలా?"

అతని స్వాతంత్ర్య ప్రీతి ఎలాంటిదంటే.

"నా ఆస్తిని హరించినా
నా రక్తాన్ని చిందించినా
నా ఆత్మను బాధించలేరు
నా ధర్మాన్ని సాధించలేరు". అన్నాడు.

అమాయక పీడిత ప్రజలకు జాలికాదు, న్యాయం కావాలంటూ అంటాటు:

"ఎందుకు చూపుతావు జాలి?
మాకు న్యాయం కావాలి.
అపరాధులపై కురిపించుకో నీజాలిని
అమాయకులు మాత్రం కోరుకునేది న్యాయాన్ని".

ఖలీల్ ఒక రెబెల్. నిరంకుశ పాలకవర్గాన్ని, మూఢ మతాచార్యులనూ బహిరంగంగా ఆక్షేపించి తిరుగుబాటు చేశాడు. దేశంనుండి బహిష్కరింప బడ్డాడు, మతంనుండి వెలివేయబడ్డాడు. విదేశాలనుండే నిరంకుశత్వాన్ని నిరసిస్తూ, కృత్రిమ వేదాంతాన్ని బయటపెడుతూ భావ, వాక్స్వాతంత్రాలను ప్రకటిస్తూ కవిత సాగించాడు:

నిరంకుశ ప్రభువులను గురించి అన్నాడు:

"శిరసెత్తుతారు కొందరు గిరిశిఖరాల్లా
కానీ పడిఉంటారు కారుచీకటి గుహల్లా"

మూఢ మతాచార్యులను గురించి అన్నాడు:

"పరమ భక్తుల అస్థి
పంజరమ్ములపైన
గుళ్లకట్టే ధర్మ
కోవిదులు ఎందరో?"

స్వేచ్ఛాప్రియుడు, జిబ్రాన్, సవాలు చేస్తాడు:

"ఎవరితో ఉంటావో తేల్చుకో—
విన్నాటి దాస్య వర్తులతోనా?
రేపటి స్వేచ్ఛా మూర్తులతోనా?"

ఖలీల్ కవితకూ సమకాలీన జీవితానికీ ఏమాత్రం సంబంధం లేదని కొందరు మార్క్సిస్టు విమర్శకుల అభిప్రాయం. ఆ విమర్శ ఆదరణీయం కాదు. ఖలీల్ ఏ యుగానికీ చెందనివాడు. అన్ని యుగాలకూ, అన్నికాలాలకూ, అన్ని దేశాలకూ, అన్ని జాతులకూ చెందినవాడు. ఖలీల్ చెప్పేవి జీవితసత్యాలు, అవి నిరంతర జ్యోతులు. అన్నాడు గదా,

"ఎవరి నెవరు సృష్టించిరి
మనిషిని దేవుడా? దేవుణ్ణి మనిషా?"

"నరకంలేదు యీతనలో—అది
ఉన్నది రిక్త హృదయంలో"
"చుంచు బిందువును తిలకిస్తున్నాను
మహోదధి రహస్యాలు కనుగొన్నాను."

ఈ మాటల్లో యుగయుగాల విజ్ఞానమున్నది గదా: ఏనాటికైనా ఈమాటలు సత్యమే కదా:

"దేశ నాశకుడెవడు:
నేల దున్ననివాడు
నేత నేయనివాడు
రాళ్లు మోయనివాడు
రాజకీయమే వృత్తిగా
రంగు ఫిరాయించేవాడు"

సమకాలీన రాజకీయ నాయకులను గురించి కాదా: ఈ పద్యాలు: నేటి నాయకులకూ వర్తించవా: ఇవి:

"నిరుపేదలు పండించిన పంటను
కిరాతకులు కాజేస్తుంటే
చట్టం పేరుతో ఉన్న దమననీతి
చుట్టూ కాపలా కాస్తున్నది"

మార్క్సిస్టు సిద్ధాంతాల ప్రకారం, చట్టాలు, న్యాయస్థానాలు నిర్వహిస్తున్న పాత్ర ఇది కాదా:

పోయిన సంవత్సరం ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులు ప్రతి గోడమీదా వ్రాశారు "భావాలకు సంకెళ్లులే"ని. అదే భావం జిబ్రాన్ ఎలా చిత్రించాడో చూడండి:

"నాచేతులకు సంకెళ్లు వేసినా
నా కాళ్లకు గొలుసులు కట్టినా
చీకటి చెరసాలలో నన్ను నెట్టినా
స్వచ్ఛందమైన నా ఆలోచనలను
చచ్చినా బంధించలేరు."

జిబ్రాన్ అభ్యుదయమంటే పురోగమనమంటాడు:

"గతానికి మెరుగులు దిద్దడమే కాదు అభ్యుదయం
భవిష్యత్తు వైపు పరుగులు తీయడమే అభ్యుదయం"

తిరుగుబాటు వాంఛిస్తాడు. కానీ కట్టుబాటుండాలంటాడు:

"తిరుగు బాటులేని జీవితం
వసంతంలేని ఋతువలయం.
కట్టుబాటులేని తిరుగుబాటు
వట్టి ఎడారిలో వసంతోదయం"

ప్రేమ, ప్రేమికులంటే తన హృదయాన్నిస్తాడు:

" ఏ ఋతు సంగతి లేకున్నా వికసించే కుసుమం ప్రణయం".
"మొదటి ముద్దు– వలపు పాటకు తొలకరి
జీవిత తరుశాఖ లింపై విరసిన తొలివిరి
నాలుగు పెదవులు పలికే మౌన మంత్రాక్షరి"

మాతృభాషపైని పుక్కువవల్లనో, మరి నారాయణరెడ్డి తీయని కవిత మీది మమతవల్లనో, ఈ స్వచ్ఛందానుసరణా కవితోక్తులు ఖలీల్ జిబ్రాన్ మూల సూక్తులకే వన్నెదెచ్చిన ఎనిపిస్తుంది నాకు. అనుసరణలు కావని జిబ్రాన్ కవితను పెల్లించిన కిరణాలవి. చూడండి మరి, మూలంలో

"The human soul is but a part of a burning torch
Which God separated from Himself at creation".

నారాయణరెడ్డి అనుసరణలో,

"మానవాత్మ– ప్రజ్వలించే మహాజ్వాల
ఏదివడిందది పరమాత్మనుండి సృష్టివేళ"


మూలంలో

"How many flowers
Possess no fragrance from the day
Of their birth! How many clouds
Gather in the sky, barren of rain,
Dropping no pearls"

నారాయణరెడ్డి అనుసరణలో.

"పుట్టినప్పటినుండి పరిమళాలే లేని
పూలెన్ని లేవు?
గగనాన మూగి వర్షించగాలేని మే
ఘాలెన్ని లేవు?"

ఇలాంటివి ఇంకా ఎన్నో! మీరే చదవండి.



సౌందర్య సత్యాలు - జీవితం
సాధించిన రెండు వరాలు.
ఒకటి ప్రేమికుని హృదయంలో
ఒకటి శ్రామికుని స్వేదంలో.

2

మహాశ్మశానాలారా! మరిచిపోతారెందుకని
గుహల్లో నివసించే మనుషులింకా ఉన్నారని.
ఏవీ ఆ గుహలు?
ఇవిగో మన హృదయాలు.

3

ఆవని నిశ్వసిస్తే జననం
అది ఉచ్ఛ్వసిస్తే మరణం.

4


సంకల్పబలమే ఉంటే
సాధించలేని దేమున్నది?
మంచుపొగనే రవిబింబంగా
మార్చివేయగలుగుతుందది.

5

ఆత్మలు జ్వలించే ఆగ్నులు
వాటి బూడిదలే ఈ దేహాలు.

6

కవిత్వం హృదయజ్వాల
వక్తృత్వం హిమఖండహేల
ఆ మంటనూ ఈ మంచునూ
ఐక్యం చేసేది ఎలా?



అసలే మనుషులు దుర్బలులు
అందులో చచ్చేటన్ని చీలికలా ?
అసలే ఈ లోకం ఇరుకు
అందులో ఇన్నిన్ని రాజ్యాలా ?

8

అన్నీ తిన్న మానవుని
అజీర్తే వేదాంతం.

9

వారసత్వంతోనే మానవుడు
వరణీయుడు కాడు.
నరహంతకుల వంశంలో
పురుషోత్తము లెందరులేరు?

10


ఎవరి నెవరు సృష్టించిరి
మనిషిని దేవుడా? దేవుణ్ణి మనిషా?
కల్పనయే ఈ సృష్టికి మూలమంటాను.
కళయే దాని సువ్యక్త రూప మంటాను.

11

జ్ఞానికీ అజ్ఞానికీ మధ్య వ్యత్యాసం
సాలెగూటికన్న చాలా చాలా సున్నితం.

12

కడలి కుంగినపుడు: ఇసుకపైన
వ్రాసినాను నా అనుభవకోశం.
కడలి పొంగినపుడు; ఇసుకలోన
చూసినాను అజ్ఞాన శేషం.



మిన్నులకు అతీతంగా విరబూసిన పువ్వు
ఎన్నడూ వాడిపోదు.
ఉదయ సంధ్యావధువు పెదవిమీది పాట
ఎన్నడూ ఆగిపోదు.

14

పుట్టిన ప్రతి మనిషికీ
మృత్యువే చరమావధి.
ఆత్మకు మాత్రం అది
అంతమే లేని ఆది.

15

పుర్రెకెక్కని చదువులు వల్లెవేసేవాడు
పుస్తకాలను మోసే గాడిదకు సైదోడు.

16


తిరుగుబాటులేని జీవితం
వసంతంలేని ఋతువలయం.
కటుబాటులేని తిరుగుబాటు
వట్టి ఎడారిలో వసంతోదయం.

17

మానవాత్మ - ప్రజ్వలించే మహాజ్వాల
పిడివడిందది పరమాత్మనుండి సృష్టివేళ.

18

ప్రతిహేమంతం ఎదలో ఎజవజ
వణికే వసంతముంది.
ప్రతిరాత్రి ముసుగుతెరలో చిరునగ
వొలికే ప్రభాతముంది.



అసంఖ్యాక పథాలలో పయనిస్తుంది విజ్ఞానం
ఆరంభమే తప్ప దాని అంతం తెలియదు మనకు.
కడదాకా నడిపిస్తుంది కనిపించని కాలం
కానీ మనం చూసేది మలుపు తిరిగేవరకు.

20

పిరికివందు తాగితాగి
పెరిగిన మానవమాత్రుడు
వరదనుచూస్తే చాలు
నెరియల్లో నక్కుతాడు.

21

సాహసం ఒక అగ్నిపర్వతం
ససేమీ మొలవదు దానిపై భీరుత్వబీజం.

22


కొందరి హృదయాలు
బళ్లలోని నల్లబల్లలు.
కాలమేమో గీతలుగీసుంది.
తడిగుడ్డేమో తుడిచేస్తుంది.

23

ఉన్నదాన్ని కనుగొంటాడు మానవుడు
లేనిదాన్ని సృష్టించలేనే లేడు.

24

తినేటప్పటి హడావిడి
నడిచేటప్పుడు నాస్తి.
ఐతే - ఒక వినతి.
అడుగులతో తినండి
అరిచేతులతో నడవండి.



ఈజీప్టు పిరమిడ్లు నేలపైకి ఒరిగినా
న్యూయార్క్ సౌధాలు ధూళిలోన కరిగినా
సీతాకోకచిలక తేలుతూవుంటుంది చేలపై
హిమబిందువులు రాలుతూవుంటాయి పూలపై.

26

ఏమిచెప్పను ?
నేనిచ్చిన సొత్తుతో కత్తి సంపాదించి
నన్నే పొడవాలనుకునేవాణ్ణి గురించి.

27

అతడు నాకు తెలియదా ?
అతని బాబే తెలిసినప్పుడు.

28


పుట్టినప్పటినుండి పరిమళాలే లేని
పూలెన్ని లేవు ?
గగనాన మూగి వర్షించగాలేని మే
ఘా లెన్ని లేవు ?

29

శిఖరాలెత్తుతారు కొందరు గిరిశిఖరాల్లా
కానీ పడివుంటారు కారుచీకటి గుహల్లా.

30

దూరంగా ఉంచు ప్రభూ !
కరుణలేని విజ్ఞానం నుంచి
చిరునవ్వెరుగని వేదాంతం నుంచి
శిశువు ముంచు శిరసొగ్గని
అహంకారం నుంచి.



పరమభక్తుల అస్థి
పంజరమ్ముల పైన
గుర్ము కట్టే ధర్మ
కోవిదులు ఎందరో ?

32

ధనాన్ని తృణీకరించుమని
ధర్మపన్నాలు వల్లించే
ధనస్వాములున్నారు జాగ్రత్త!

33

చరిత్ర పునరావృత్తం కాదు
చరిత్ర ఎరుగని మతులలో తప్ప.

34

కాపాడవయ్యా ప్రభూ! నన్ను
కాటువేసే పాములనుంచి
ఓటమి పొందిన కీర్తికాములనుంచి.

35

పురుషోత్తముడెవడు?
పొగిడితే పులకాసం చేసేవాడు
తెగిడితే ఉపాసం వహించేవాడు.

36

దేశ నాశకుడెవడు?
నేల దున్నని వాడు
నేత నేయని వాడు
రాళ్లపోయని వాడు
రాజకీయమే వృత్తిగా
రంగు పిరాయించే వాడు.



'నీ శత్రువును ప్రేమించు' మని
నా శత్రువు చెప్పగా విని ;
అక్షరాలా పాటించాను
నన్ను నేనే ప్రేమించాను.

38

ఆశావాది చూసేది ముళ్లనుకాదు; గులాబీని.
నిరాశావాది చూసేది ముళ్లనే; కాదు గులాబీని.

39

నరకమంటే వణికిపోవడమే నరకం.
స్వర్గమంటే ఉబికిపోవడమే స్వర్గం.

40

అతిశయోక్తుల మాటున
ఆత్మదృష్టిని దాచుకునే మగవాడు
అలంకారాల మాటున
వికారాలను దాచుకునే స్త్రీలాంటివాడు.

41

అన్వేషిస్తాడు మానవుడు
అక్కడెక్కడో జీవితముందని.
అతడు తెలుసుకోలేడు పాపం !
అదేదో తనలోనే వుందని.

42

నరకం లేదు యాతనలో - అది
ఉన్నది రిక్త హృదయంలో.



ముఖం చాటుచేసుకున్న ఓబ్బిలి అటు
ముసి ముసి నవ్వుల తోడేలిటు.
ఆ రెండు దుశ్శక్తుల మధ్య
ఆవునే గొర్రెల మంద.

44

తలుపుమీద ప్రాసినాను
'సంప్రదాయాలకు స్వస్తిచెప్పిన వారికే
స్వాగతం లభిస్తుం'దని.
ఒక్క పురుగు వాకిట అడుగు పెడితేనా !
నా తలుపు తడితేనా !

45

అజ్ఞాన సదనాన
ఆత్మ దర్శనమునకు
అద్ద మెక్కడిదిరా !

46

పశ్చాత్తాపంతోనే పరమపదం అందదురా
పవిత్ర హృదయంలో అది పదిలంగా ఉన్నదిరా.

47

సకల జనులూ ప్రకృతి ముందు
సచేతనులే స్వచ్ఛందులే.
మానవుని వైభవం వట్టి కల
మరునిమిసం చెదిరిపోయే నురగలా.

48

ఎవరితో ఉంటావో తేల్చుకో -
నిన్నటి దాస్య వర్తులతోనా ?
రేపటి స్వేచ్ఛా మూర్తులతోనా ?



తాను ఆనుకున్న గోడనూ
తాను నడిచే జాడనూ
అదే పనిగ చూసేవాడు
హ్రస్వ దృష్టి కలవాడు.

50

విద్యలేని విచక్షణ
నైద్యం చేయని క్షేత్రం
పోషణలేని దేహం.

51


నిరుపేదలు పండించిన పంటను
కిరాతకులు కొజేస్తుంటే
చట్టం పేరుతో ఉన్న దమననీతి
చుట్టూ కొపలా కొస్తున్నది.

52

హంతకులంటున్నాం మనం
హత్యలు చేయని వాళ్లను.
దొంగలంటున్నాం మనం
దోపిడీ ఎరుగని వాళ్లను.
కల్లరులంటున్నాం మనం
కటిక నిజాలు పలికేవాళ్లను.

53

ఎందుకు చూపుతావు జాలి ?
మాకు న్యాయం కావాలి.
అపరాధులపై కురిపించుకో నీ జాలిని.
అమాయకులు మాత్రం కోరుకునేది న్యాయాన్ని.



పాటలోని రహస్యం
పట్టువడి పోతోంది
గాయకుని గళాన్నిబట్టి
సహృదయుని స్పందనను బట్టి.

55

నీ తల్లి ఎవరో చెప్పు.
ఆ తర్వాత చెబుతాను నువ్వెవరో.

56

లోయలను చూడాలంటే
గిరి శిఖరం చేరుకో.
గిరి శిఖరాన్ని చూడాలంటే
మబ్బుల్లోకి దూరిపో.
మబ్బులోతు తెలుసుకోవాలంటే
కళ్లు రెండూ మూసుకో.

57

అగ్నిపర్వతం లాంటిది ఉత్సాహం
మొలవదు దానిపై ఏ సందేహం.

58

ఆత్మ రహస్యమే అసలైన కవిత్వం
అంతకుమించి అధికప్రసంగం వ్యర్థం.

59

అందరూ యోధులే జీవిత సమరంలో —
కొందరు అగ్రసరులు
కొందరు అనుచరులు.



జడ ప్రాయంగా ఉన్న
అమితజ్ఞానం కన్న
చైతన్య రూపంలో ఉన్న
పరిమితజ్ఞానం మిన్న.

61

అసలైన వేదాంతి ఎవడు ?
అన్ని రుచులూ చూసినవాడు
ఆపై తిరుగుబాటు చేసినవాడు.

62

అనేక విధాలుగా తననే
అర్చించుకుంటాడు మానవుడు.
అతని ఆత్మపూజకు నా
మాంతరమే దేవుడు.

63

చిరిగిపోయిన ఆలోచనలను
అరువుమాటల మాసికలతో
కప్పిపుచ్చే కవులు కలరెందరో.

64

నమ్మకం వేరు నడక వేరు.
ప్రసంగిస్తారు పలువురు సాగరాల్లా
జీవిస్తారు పాడు బురద గుంటల్లా.

65

తప్పుకుంటాను నేను
గభీరతనూ సుకుమారతనూ
భీరుత అనేవాళ్లనుంచి.
వాచాలతను వివేకంగా
మౌనాన్ని అజ్ఞానంగా
భావించే వాళ్లనుంచి.



గొలుసులో కట్టువడ్డ ప్రతివాడు
తలవంచినవాడు కానే కాడు.
ఒక్కొక్కప్పుడు ఆ ఉక్కు సంకెల
కాకపోదు నవరత్నమాల.

67

చట్టాల వలలు పన్నే దెందుకు ?
చిట్టి చేపలను పట్టేటందుకు.

68

దయ్యమంటే భయముంటే
దైవమంటే సంశయమే.

69

కొందరు చెవులతో వింటారు
కొందరు పొట్టలతో వింటారు.
కొందరు జేబులతో వింటారు
మరి కొందరు విననే వినరు.

70

చేలలోని ఏలపాటలు ఎలా వింటాము ?
చెవులలో నగరసంగీతం చవులొల్కుతుంటే.

71

ప్రతి మనిషీ నెన్నుదిట
వ్రాసివుంది వాని చరిత.
అది చదువగలిగిన వాడు
ఆత్మలిపి నెరిగిన వాడు.



సంగీత మొక్కటే మానవుల
సర్వ సామాన్య భాష.

73

వన్నెచిన్నెలతో మురుపు గొలిపే
వగలాడి వంటిది జీవితం.
ఆ టక్కు లెరిగిన వాడు
అందకుండ సాగిపోతాడు.

74

ఎవరు ఎవరు బొనిసలు ?
పాదుషాల దోషాలు.

75


మానవుని మనుగడ
కడలిపై తేలియాడే నురగ.
గాలి వస్తే అది గల్లంతే
మృత్యువు వస్తే అందరూ అంతే.

76

జీవితం కేవలం వినోదమే కాదు.
అది - ఆకాంక్షకూ దీక్షకూ నిలిచిన పాదు.

77

ధనం—
కుహనా ప్రణయానికి బీజం
మృషా సౌభాగ్యానికి మూలం.
విషాక్త జలమయ కూపం
వార్ధక్య పరిపీడన రూపం.



ఏ ఋతు సంగతి లేకున్నా విక
సించే కుసుమం ప్రణయం.

79

ధనాన్ని కోరుతుంది ధనం.
దాని పర్యవసానం—
అశాంతి, ఆవేదన.

80

సత్యం—
అవ్యక్త నిశీధంలోనే
అగుపించే నక్షత్రగుచ్ఛం.

81


కష్టైదుట ఉన్న ప్రకృతిని
కటిక చీకటి కప్పేస్తుంది.
ఎదలో నిండిన ప్రణయాన్ని
అది ఎలా దాచేస్తుంది?

82

మట్టితో మధుపాత్రను సృష్టించవచ్చు
వట్టి ఇసుకతో తీర్చేదేమిటి దిద్దేదేమిటి ?

83

నా ఆత్మ బోధించింది.
ఏమని ?
మరుగుజ్జుకంటే ఉన్నతుణ్ని కానని
మహా కాయునికంటే చిన్నవాణ్ని కానని.



రెండు అంశాల మధ్యలో ఉన్న
సందును వెతకడమే వేదాంతం.

85

మనకంటే ఘనమైనవి కావు
మనరూపాలూ, నుడులూ నడవడులూ.
ఆత్మయే మన ఆలయం
అక్షులే గవాక్షాలు.
మాటలే దూతలు.

86

సిరుల బరువుతో నా హృది
పరిశ్రాంతమైయున్నది.
రండి ధనాన్వేషులారా :
గుండె బరువు దించిపొండి.

87

హృదయంలో యుగయుగాల
మధువు తొణికిపోతున్నది.
రండి పిపాసువులారా :
గుండె నిండ తాగిపొండి.

88

రసాత్మలను మిన్నులకెత్తే
విశృంఖల ప్రణయగతిని
అరికట్టలేవు శాసనాలు
అడ్డగించలేవు పరిసరాలు.



మొదటి ముద్ద - వలపుపాటకు తొలకరి
జీవిత తరుశాఖ శిఖపై విరిసిన తొలివిరి.
నాలుగు పెదవులు పలికే మౌన మంత్రాక్షరి.

90

అసలైన జాతీయ సంపద
పసిడిలో లేనే లేదు.
విద్యలలో ఉంది; వివేకంలో ఉంది.
అనవద్యమైన ఆర్జవంలో ఉంది.

91

నిశ్చయబుద్ధి లేని విజ్ఞాని
నిరాయుధంగా అనికిసాగే సేనాని.

92


పూలు దొంగిలించినవాడు హీనుడట
చేలు కొల్లగొట్టినవాడు ధీరుడట.
తనువును చంపినవాడు దండనార్హుడట.
ఆత్మను హింసించినవాడు హాయిగా ఉండొచ్చట.

93

నా అస్తిని హరించినా
నా రక్తాన్ని చిందించినా
నా ఆత్మను బాధించలేరు
నా ధర్మాన్ని సాధించలేరు.

94

పంజరంలో ఉన్న పక్షి కట్టుకోదు గూటిని
తన పిల్లల కాగూడు పంజరం కొతుందని.



శక్తి సహనాలు
సమ భాగస్వాములు.

96

పసిడి కూడబెట్టుకునే
పిసినిగొట్టు జీవితం
సమాధిలో లుకలుకమను
క్రిములకు రూపాంతరం.

97

తపలు గిరులు రురులు కొల
తరంగాల తాకిడితో
మారునట్లు; మనిషి మారు
అనుభవాల రాపిడితో.

98

గతానికి మెరుగులు దిద్దడమే కాదు అభ్యుదయం
భవిష్యత్తువైపు పరుగులు తీయడమే అభ్యుదయం.

99

పొరుగువానికి నీ బాధ చెప్పుకోవడం
హృదయ ఖండాన్నే అర్పించుకోవడం.
అతడు ఉన్నతుడైతే గుండెల కద్దుకుంటాడు
అల్పుడైతే పొడి నవ్వు నవ్వుకుంటాడు.

100

ఆత్మ నా హితవరి
అది చెప్పిన దేవని?
గళాలు పలుకని
స్వరాలు వినుమని.



అలరించలేడు గాయకుడు
ఆతడు పరవశిస్తేగాని.

102

గొప్పతనం ఎక్కడుంది ?
పదవిలో కాదు
పదవిని నిరసించిన వానిలో.

103

నా ఆత్మ
చీకటిలో సాగిపోయే జవనాశ్వం.
పరుగునుబట్టి ప్రభాతం
గతినిబట్టి గమ్యం.

104

ఆత్మను ఆకర్షించేదే
అసలైన అందం.
అందుకోవడం కాదు
అందివ్వడమే దాని చందం.

105

ఆచారాలకేమి పుట్టుతూనే ఉంటాయి.
చీకటిలో నీడల్లా గిట్టుతూనే ఉంటాయి.

106

నా చేతులకు సంకెళ్లు వేసినా
నా కాళ్ళకు గొలుసులు కట్టినా
చీకటి చెరసాలలో నన్ను నెట్టినా
స్వచ్ఛందమైన నా ఆలోచనను
చచ్చినా బంధించలేరు.

107

తాత్కాలిక లోపం - లేమి.
తరిగిపోని రోగం - తలకు మించిన కలిమి.

108

పెలతెలిసిన అందరికీ
పిలువ తెలుసునంటారా ?

109

సత్యమహాసౌధానికి లెక్కలేని తలుపులు
తట్టిన వారందరికీ స్వాగతాల పిలుపులు.

110

దారిద్ర్యం వివేచనలో తలదాచుకుంటుంది
తడినంతరం కొసులకు తల ఒగ్గుతుంది.

111

వచించేదీ ప్రచురించేదీ ఏమీలేకున్నా
వాక్ స్వాతంత్ర్యాన్నిగూర్చి వాగుడు మిన్న.

112

నిన్నటి ఖాతా తిరగేస్తే నీకే తెలుస్తుంది
లోకానికీ జీవితానికీ ఎంత ఋణపడ్డావో.

113

సత్యమంటే ఏమిటి ?
సర్వేశ్వరుని వజ్ర సంకల్పం.

114

కట్టడంలోని గట్టిరాయి ఏది ?
పునాది అట్టడుగున ఉండేది.

115

మనిషి కంటి భూతద్దంలో
మహత్తరంగా అగుపిస్తుంది లోకం.

116

జ్ఞాపకాలు జ్ఞాపకాలు జ్ఞాపకాలు
ఆశాపథంలో పాకుడురాళ్లు.

117

విరితోటలో విహరించినట్లు
కవలి కడుపులో తిరుగాడేదెవరు ?

118

ధర్మాత్ముడు మానవుని హృదయ బంధువు.
కరుణాత్ముడు ఈశ్వరుని ఆత్మబంధువు.

119

బాష్పధారలో తడిసిన ప్రణయం
స్వచ్ఛంగా ఉంటుంది నిరతం.

120

వదనంలో లేదు అందం.
అది హృదిలోని కాంతి పుంజం.

121

మూర్ఖునితో చేసే స్నేహం
తాగుబోతుతో జరిపేవాదం.

122

అజ్ఞాన మూలమే తెలుసుకుంటే
అప్పుడు నేను మహర్షినే.

123

సువ్వంటే నా కిష్టం.
ఎందుకని ?
ప్రబల దుర్జనుడీముందు పరమదుర్బలుడివి
సంపన్న లోభిముందు నిరుపేద జీవివి
అందుకని.

124

వివరించే అవసరం ఎందుకొస్తుంది
విషయం అసమగ్రమైనప్పుడే.

125

నువ్వు పేదవడివైతే ఏంచేయాలి ?
సిరుల కొలమానాలతో నరులను కొలిచేవారి
స్నేహాన్ని తెంచుకోవాలి.

126

మంచు బిందువును తిలకిస్తున్నాను
మహోదధి రహస్యాలు కనుగొన్నాను.

127

పరిపూర్ణ పరిజ్ఞానమే కవిత్వం - అది
సగం తెలిసిన వానికి అందని పరమార్థం.

128

సహన క్షేత్రంలో నాటిన బాధ
సంతోషఫలాలను అందిస్తుందిగదా !

129

ప్రణయం లోతు తెలియదు
విరహం ముంచుకొచ్చేవరకు.

130

మరణమంటే మహా భయం
నిదురన్నా కలలన్నా ప్రియం.

131

ప్రకృతి ప్రసవించిన పాపలే పూలు
అనురాగం కుసుమించిన పూలే పాపలు.

132

ఏకాంతంలో బలవంతుడు ఎదుగుతాడు
పాపం ! దుర్బలుడేమో అణగుతాడు.

133

పాట పాడలేడు
పాడు నోటివాడు.

134

పణికిపోయే ఆనందమే
వలపు.

135

పక్కదారి తొక్కినవాడే
రచ్చకెక్కుతాడు.
పదుగురితో నడిచేవాణ్ణి
పట్టించుకోడెవడు.

136

ఏదీ మనభయంకర లోపం
ఇతరుల లోపాలను ఎన్నడం.

137

తుఫాను గర్జిస్తుంటే ఎవరుపింటాపు
కొండవాగు తీసే కూని రాగాన్ని.

138

అనురాగం- మృత్యువులాగే
అన్నిటినీ మార్చేస్తుంది.

139

సాగర సంగీతం ఆగేది తీరంలోనా?
శ్రవణించే వారి హృదయద్వారంలోనా?

140

కళయేదో నన్నడుగు.
వ్యక్తం నుంచి అవ్యక్తంలోకి
పేసే ఒక అడుగు.

141

ఇలను దున్ని విత్తనాలు అలికినప్పుడే
ఇలలో మొలకెత్తింది నాగరికత.

142

రుజువును కోరే సత్యం
సిజంగా సగం సత్యం.

143


కవిత్వం ఒక మెరుపు
కాదది పొడిమాటల కూర్పు.

144

కనులతో చూసే దాని కన్న
మనసులోని సౌందర్యం మిన్న.

145

అనురాగంతో కూడుకున్న బాధ
ఆనందదాయకం కాదా!



తుపానులకు జడిసేవాళ్లు జీవన్మృత్యులు
తుపానులతో నడిచేవాళ్లు చైతన్యవ్రతులు.

147

అచ్చమైన పూజకు
అక్కరలేదు ఏకాంతం.

148


ఎంత అల్పుడు వాడు!
ఈజగమునకు బదులు
అరిచేతి గీతలను
పరికించువాడు.

149

ఎవడయ్యా స్వేచ్ఛా పరుడు?
ఓపికగా బానిసల బరువులు
మోసుకు పోయే వాడు.

150

తన అక్షుధారలో తానే తడిసిన వాడు
మునుముందు స్వచ్ఛంగా పునగలుగుతాడు.



x5



తెలుగు ఎదలో తెలుగుతనం

వెల్లువలా పారాలని

తెలుగింటిలో తెలుగుదీపం

అఖండంగా వెలగాలని

ఈజాతి నిదురలేచి

మహోన్నత మానవాదర్శాల వైపు

నిరంతర కృషితో

పయనం కొనసాగించాలనే ధ్యేయంతో

ఉడుతాభక్తిగా యువభారతి కృషి చేస్తున్నది.

భాషాభిమానం కలగాలంటే

మాతృభాషా సాహిత్య పఠనమే

ప్రథమ కర్తవ్యం అనే భావం

బలంగా మనసులో నాటుకోవటానికి గాను

వీలైనంత ఎక్కువ మందికి వీలైనంత తక్కువ వెలకు

ఉత్తమసాహిత్యం అందిచేందుకు

యువభారతి పూనుకున్నది.

ప్రతి తెలుగింటిలో

కనీసం పదయినా తెలుగు పుస్తకాలు ఉండేందుకు

మనందరం ఉద్యమ వేగంతో కృషి చేద్దాం.

ఆ పదిమంచి పుస్తకాలలో ఏ ఒక్కటిగానైనా

యువభారతి ప్రచురణ ఏ ఒక్కటైనా

ఉండాలనే ధ్యేయంతో కృషిచేద్దాం.

యువభారతి

సాంస్కృతికసంస్థ

నికిందరిబాదు.3

Check List

Book Number	SymR01B164	Date	19/8/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	57, 57		
Missing Pages	NO		
Prepared By	Sruthi	Cutting By	Sruthi
Scanned By	Anbarasu	Pages	61